క్లుప్తంగా

రాయితీపై జీలుగ విత్తనాలు

రఘునాథపల్లి : రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న జీలుగ విత్తనాలను రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవాకేంద్రంలో 150 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, సోమవారం పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 30 కిలోల బస్తా ధర రూ.4,275 కాగా సబ్సిడీ పోను రూ.2,137 చెల్లించాలన్నారు. జీలుగ విత్తనాలు అవసరమైన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్సులతో సంబంధిత ఏఈఓల వద్ద పర్మిట్ పొంది ఆగ్రోస్‌లో విత్తనాలు పొందాలని ఆయన కోరారు.

రోడ్డుపైనే తోపుడు బండ్లు

● వాహనదారులకు తప్పని ఇబ్బందులు



బచ్చన్నపేట : మండల కేంద్రంలోని సంతలో (అంగడి) తోపుడు బండ్లను రోడ్డుపైనే నిలపడంతో పలువురు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఆదివారం నిర్వహించే సంతలో పండ్లు, కూరగాయలు, ఎండు మిర్చి, మాంసం, చేపలు, దుస్తువులు, చెప్పులు, పలు నిత్యావసర సరుకులను విక్రయిస్తుంటారు. ఈ సంతకు చుట్టు పక్కల గ్రామాలతో పాటు చేర్యాల, నర్మెట, జనగామ, రాజపేట, ఆలేరు మండలాల పరిధిలోని గ్రామాల నుంచి కూడా ప్రజలు వచ్చి వస్తువులను కొనుగోలు చేస్తారు. ఇదే రోడ్డుపై పలు రకాల వస్తువులు, పండ్లను విక్రయించే తోపుడు బండ్లను రోడ్డుపైనే నిలపడంతో వాహనాలు ఎదురెదురుగా వస్తే అనేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చొరవ చూపి వారాంతపు సంతలో తోపుడు బండ్లను రోడ్డుపై నిలపకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

గురుకుల విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ

పాలకుర్తి టౌన్ : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థలో చదవి, ఉపాధి లేని వారి ఇన్ఫోసిస్ ఆధ్వర్యంలో నిర్వహించే కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పాలకుర్తి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. స్వరూప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 19నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన గురుకుల పూర్వ విద్యార్థులకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో కంప్యూటర్ నందు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు పాలకుర్తిలోని సాంఘిక సంక్షేమ కళాశాలలో సంప్రదించగలరని తెలిపారు.

నియామకం



సోమేశ్వర్

రఘునాథపల్లి : మండల కేంద్రానికి చెందిన తుమ్మలపల్లి సోమేశ్వర్‌ను బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా మండల అధ్యక్షుడు పుప్పాల వేణు కుమార్ నియమించారు.

మానవ సేవే పరమావధిగా..

● ప్రజాసేవలో వాస్విక్ ఫౌండేషన్
● ఇక ముందు కూడా సేవలు కొనసాగింపు



వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ అబ్బయ్య (ఫైల్)



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న సీఐ మల్లేష్ (ఫైల్)

బచ్చన్నపేట : ఆపదలో సాయపడుతు.. పేదలకు అండగా నిలుస్తు వాస్విక్ ఫౌండేషన్ ముందుకు సాగుతోంది. ఆకలి బతుకులు లేని సమాజాన్ని నిర్మించేందుకు తమ వంతు సాయంగా సేవ అందించేందుకు మండలంలోని కట్కూర్ గ్రామానికి చెందిన నిడిగొండ నరేష్‌కుమార్, లక్ష్మాపురం గ్రామానికి చెందిన నూకల భాస్కర్‌రెడ్డిలు కలిసి నరేష్ కుమార్ మూడేళ్ల కుమారుడు వాస్విక్ మృతి చెందగా 2019, నవంబర్ 14న వాస్విక్ ఫౌండేషన్‌ను స్థాపించారు. కరోనా సమయంలో చాలా మందికి నిత్యావసరాలను, శానిటైజర్లను, మాస్కులను దాదాపు రూ. 2 కోట్ల విలువైనవి పంపిణీ చేశారు. 200 గ్రామాల్లోని పల్లెప్రకృతి వనాల్లో ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా రెండు వేల బారికేడ్లు అందిస్తూ ప్రాణం విలువను గుర్తుచేశారు. 200 అనాథ శవాలకు అన్నీ తామై సాంప్రదాయ పద్ధతుల్లో అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో 90కి పైగా మెడికల్ క్యాంపులను నిర్వహించారు. ఉచిత ఆపరేషన్లు, మందులను అందించారు. అనాథ, వృద్ధాశ్రమాల్లో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ మొక్కలు నాటారు. అలాగే పదేళ్లుగా పలు పట్టణాల్లో వేసవి కాలంలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తూ మజ్జిగను కూడా పంపిణీ చేస్తున్నారు. ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. ఇందుకుగానూ వీరికి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారిచే సర్వీస్ ఎక్స్‌లెన్సీ అవార్డు, ఇన్‌స్పైరింగ్ యూత్ ఆఫ్ ఇండియా అవార్డు, నంది అవార్డులను కూడా అందుకున్నారు. ఇక ముందు కూడా తమ ఫౌండేషన్ ద్వారా సేవలను కొనసాగిస్తామన్నారు.

ప్రజా సేవే లక్ష్యంగా..



పేదవారికి సేవ చేయాలన్నదే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. వయస్సులో చిన్నవాళ్లమైనా పెద్ద కార్యాన్ని తలపెట్టి ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా తట్టుకుంటూ సేవే పరమావధిగా సాగుతున్నాం. మా సేవకు ప్రజల నుంచి దీవెనలు అందుతున్నాయి.

– నూకల భాస్కర్‌రెడ్డి, ఫౌండేషన్ వైస్ చైర్మన్

ధృఢ సంకల్పంతో సాగుతున్నాం



ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరేళ్లగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక సేవలందిస్తున్నాం. పలువురు ఉత్సాహవంతులను ఫౌండేషన్ సభ్యులుగా చేర్చుకుంటూ వారి ద్వారా ఆయా ప్రాంతాల్లో సేవలను అందిస్తు విస్తరిస్తున్నాం. ఎన్ని కష్టాలు వచ్చినా, మా సేవా కార్యక్రమాలను ఆపబోము. సేవలను ఉధృతం చేయడానికి పలువురి సలహాలను స్వీకరిస్తున్నాం.

– నిడిగొండ నరేష్‌కుమార్, ఫౌండేషన్ చైర్మన్

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ కొండ రవి



జఫర్‌గఢ్ : రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన తిమ్మంపేట విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్ : మెదక్ జిల్లా తూప్రాన్‌లో నేటి నుంచి 21వ తేదీవరకు నిర్వహించనున్న 11వ జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ పోటీలకు శివునిపల్లి జెడ్పీఎస్ఎస్‌కు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం కుసుమ రమేష్, పీడీ కొండ రవి ఆదివారం తెలిపారు. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు బానోత్ ప్రకాశ్, నర్సింగ సాత్విక్, గుగులోత్ మధుసూదన్, గుర్రం తేజ ఉత్తమ ప్రతిభతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం, పీడీతో పాటు అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ రాధిక, పూర్వ విద్యార్థుల కమిటీ బాధ్యులు జొన్నల రాజేశ్వర్, యంజాల ప్రభాకర్, ఎండీ.దస్తగిరి, నాగబండి వెంకట్రాంనర్సయ్య, పాలకుర్తి సోమశేఖర్, గోలి రాజశేఖర్ తదితరులు అభినందించారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు తిమ్మంపేట విద్యార్థులు..

జఫర్‌గఢ్ : మండలంలోని తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షారోస్, పీడీ హరిత, కోచ్ కొండ రవి ఆదివారం తెలిపారు. పాఠశాలకు చెందిన జాటోత్ అంజి, అడెపు నిరంజన్, మల్లం రోహిత్, మునిగాల శశిధర్ స్టేషన్‌ఘన్‌పూర్‌లోని శివునిపల్లిలో జరిగిన సాఫ్ట్‌బాల్ జూనియర్ బాలుర విభాగంలో పాల్గొని క్రీడా ప్రతిభను కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. ఎంపికైన విద్యార్థులను అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ భాగ్యమ్మ, దాత చాట ప్రవీణ్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

'కాంగ్రెస్ తప్పుడు ప్రచారం సరికాదు'



మాట్లాడుతున్న ప్రసాద్

స్టేషన్‌ఘన్‌పూర్ : ఘన్‌పూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన పనులనే తాము తెచ్చినట్లుగా కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదని బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు మారెపల్లి ప్రసాద్ పేర్కొన్నారు. ఘన్‌పూర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఆధ్వర్యంలో వంద పడకల ఆస్పత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ తదితర పనులకు మంజూరు వచ్చాయని, ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరి వాటిని తానే తెచ్చినట్లుగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అసత్యపు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన శ్రీహరికి నైతికత ఉంటే తక్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకుల బెదిరింపులకు బీఆర్ఎస్ యువత భయపడే ప్రసక్తే లేదని, ప్రజలంతా గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో ప్రజాక్షేత్రంలో తగిన గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు. యూత్ ప్రధాన కార్యదర్శి అనంతరపురం కమలేష్, నాయకులు గోవింద్ నరేష్, కొయ్యడ మహేందర్, గుర్రపు ప్రవీణ్, నక్క ప్రవీణ్, దాసరి రాజ్‌కుమార్, హీరాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రమజీవులకు అండగా ఎర్రజెండా

● సీపీఐ సభ్యురాలు సుగుణమ్మ



మాట్లాడుతున్న పాతూరి సుగుణమ్మ

జనగామ రూరల్ : శ్రమ జీవులకు అండగా ఎర్రజెండా ఉంటుందని సీపీఐ రాష్ట్ర సభ్యురాలు పాతూరి సుగుణమ్మ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పెద్దతండా గ్రామంలో సీపీఐ మండల నాలుగో మహాసభ నిర్వహిచారు. గుగులోత్ రాఘవులు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో సుగుణమ్మ పాల్గొని మాట్లాడారు. దేశంలో కార్మిక, కర్షక, శ్రమ జీవుల కష్టాలు బాధలు తొలగిపోవడానికి భారత కమ్యూనిస్టు పార్టీని ముందుకు తీసుకు రావాలన్నారు. దోపిడీకి వ్యతిరేకంగా పేదల పక్షాన సీపీఐ పోరాడుతోందన్నారు. జూన్ 3, 4వ తేదీల్లో నర్మెటలో జరిగే జిల్లా బహిరంగ సభను వేలాది మందితో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా చెల్లోజు మల్లేష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, లింగాల రాములు, గోల్కొండ నాగరాజు, గుగులోత్ కర్ణాకర్, నేతావత్ లక్ష్మి, భూక్య మోతిలాల్, భూక్య శంకర్, లావణ్య, సునీత తదితరులు పాల్గొన్నారు.

'అర్థరహిత విమర్శలు తగవు'

దేవరుప్పుల : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శ్రమించిన పెద్ది కృష్ణమూర్తిపై పార్టీ ఫిరాయింపు దారులతో జతకట్టి అర్థరహిత విమర్శలు చేయడం తగవని కాంగ్రెస్ పార్టీ యూత్ విభాగం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఉప్పుల సాయి ప్రకాశ్ విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయనతోపాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తోటకూరి రమేష్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో అనేక ఇబ్బందులు ఎదుర్కొని కాంగ్రెస్ పార్టీ వైభవం కోసం పాటుపడిన శ్రేణులు నియోజకవర్గంలో తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. తోటకూరి రమేష్, ఉప్పుల అనిల్, మహేందర్‌జీ, శ్రీను, వీరన్న, నవీన్, యాకస్వామి, సురేష్, సతీష్,మహేందర్, తోటకూరి మహేష ,పెద్ది రంజిత్ పాల్గొన్నారు.

రఘుపాల్ మృతి పార్టీకి తీరని లోటు

● సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

జనగామ రూరల్ : రఘుపాల్ మృతి సీపీఎంకు తీరని లోటు అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి అన్నారు. సీపీఎం సీనియర్ నాయకుడు గంగసాని రఘుపాల్ అనారోగ్య కారణంతో ఆదివారం హైదరాబాద్‌లో తుది శ్వాస విడిచారు. ఆయన చిత్రపటానికి మోకు కనకా రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కనకా రెడ్డి మాట్లాడుతూ..మండలంలోని గబ్బెట గ్రామంలో 1942లో భూస్వామ్య కుటుంబంలో జన్మించిన రఘుపాల్ తన బాల్యమంతా తండ్రి గోపాల్ రెడ్డి అనుభవించిన అజ్ఞాత జీవితంలోనే గడిపారన్నారు. 15 సంవత్సరాలు హైదరాబాద్ సీపీఎం నగర కార్యదర్శిగా పనిచేస్తూ కార్మిక ఉద్యమాన్ని నడిపిన గొప్ప మహానుభావుడు రఘుపాల్ అన్నారు. జనగామ అసెంబ్లీ నియోజకవర్గానికి కమ్యూనిస్టు పార్టీగా పోటీచేసిన ప్రతిసారి ఎన్నికల ప్రచారంలో కార్యకర్తలకు అనేక సలహాలు చేస్తూ తన ఉపన్యాసాల ద్వారా ప్రజలకు ఓటు చైతన్యం కల్పించిన గొప్ప వ్యక్తి రఘుపాల్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు, సాంబరాజు, యాదగిరి, ఇర్రి అహల్య, సింగారపు రమేష్, బూడిద గోపి, జోగు ప్రకాశ్, సుంచు విజేందర్, ఎండీ షబానా, రమావత్ మీట్యా నాయక్, సురేష్ నాయక్, పందిళ్ల కళ్యాణి, మోకు భవాని, మల్లేష్, రాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నాయకుడు రఘుపాల్ రెడ్డి : ఎమ్మెల్యే

నేటితరం యువతకు ఆదర్శ నాయకుడు రఘుపాల్ రెడ్డి అని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. రఘునాథపల్లి మండలం గబ్బేట గ్రామానికి చెందిన సీపీఎం మాజీ కార్యదర్శి గంగసాని రఘుపాల్ రెడ్డి (84) శ్వాసకోశ కేన్సర్‌తో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆయన మృతి పట్ల ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రఘునాథపల్లి: సమ్మేళనంలో పాల్గొన్న గురువులతో పూర్వవిద్యార్థులు



చిల్పూరు: చిన్నపెండ్యాలలో ఉపాధ్యాయులతో 1999-2000 బ్యాచ్ విద్యార్థులు

రఘునాథపల్లి : మండలంలోని కోమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 2004–05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు పలకరించుకొని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు పెండ్లి సత్తిరెడ్డి, వీరన్న, శ్రీనివాస్, మోహినిబాయి, సిద్దేశ్వర్, అబ్బాస్‌లను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు శివాజీ, శేఖర్, బ్రహ్మాచారి, రాజు, నరేష్, సుహాసిని, రమ, నవనీత, అనిత, అరుణ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

చిన్నపెండ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

చిల్పూరు : మండలంలోని చిన్నపెండ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యా నేర్పిన అప్పటి ఉపాధ్యాయులతో కలిసి సమ్మేళనాన్ని ప్రస్తుత హెచ్‌ఎం సంపత్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా గురువులు దామోదర్ రెడ్డి, మహేంద్రాచారి, తిరుపతి రెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఓబుల్ కేశ్వాపూర్‌లో..

జనగామ రూరల్ : మండలంలోని ఓబుల్ కేశ్వాపూర్ ఉన్నత పాఠశాలలో 2008–09లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉపాధ్యాయులు చలపతి రెడ్డి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, విద్యార్థులు సందీప్ రెడ్డి, జింకల రమేష్ యాదవ్, సంపత్ రెడ్డి, వెంకటేష్, రంజిత్ రెడ్డి, బాలు, ఎలేందర్, శ్రీకాంత్ రెడ్డి, కృష్ణ, నవీన్, ఉదయశ్రీ, రేణుక, సంధ్య పాల్గొన్నారు.

గూడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

పాలకుర్తి టౌన్ : మండలంలోని గూడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–06 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రెండు దశాబ్దాల తర్వాత కలిసిన సహచరుల ఆత్మీయతతో ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకొని పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. నాటి గురువులు రఘుపతిరావు, రామచందర్, భిక్షపతి, తిరుమలయ్య, పుష్పలత, కవిత, సుమలత, నీలారాణి, ప్రధానోపాధ్యాయురాలు శైలజను సన్మానించారు. పూర్వ విద్యార్థులు ముస్కు రాజు, కుంట అశోక్, బెల్లి మహేందర్, కంచర్ల అంజనేయులు, రాగం కిషోర్, సోమ రత్నాకర్, సింగిరెడ్డి నాగరాజు, పూజారి పరుశరాములు, గజ్జి సుష్మ, పట్టూరి సుష్మ, పెంతల శిరీష పాల్గొన్నారు.



పాలకుర్తి టౌన్: గూడూరులో 2005-06 బ్యాచ్ విద్యార్థులు



జనగామ రూరల్ : సమ్మేళనంలో పాల్గొన్న 2008-09 బ్యాచ్ విద్యార్థులు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



రమేష్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని మీదికొండ శివారులో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన శనివారం రాత్రి జరుగగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాటికొండ శివారు జీబీ తండాకు చెందిన భూక్య రమేశ్ (40) మీదికొండలోని ఇనుగాల సుధాకర్‌రెడ్డి వద్ద మూడేళ్లుగా జీతం ఉంటున్నాడు. రోజూ మాదిరిగానే శనివారం సాయంత్రం పనులు ముగించుకుని రమేశ్ తన ఇంటికి వెళ్లాడు. కాగా మీదికొండ గ్రామానికి చెందిన లద్దునూరి యాదగిరి రాత్రి రమేష్ కుమారుడైన లోకేష్‌కు ఫోన్ చేసి కుంటలో చేపలు పట్టేందుకు వెళ్దాం రమ్మని రమేశ్‌తో చెప్పాడు. దీంతో రమేష్ రాత్రి మీదికొండకు వెళ్లాడు. ఆదివారం ఉదయం మీదికొండకు చెందిన కేశరాజు రాజాంజనేయులు (డిష్ రాజు), జిన్నా శ్రీధర్‌రెడ్డి వ్యవసాయ పనులపై సుధాకర్‌రెడ్డి వ్యవసాయ భూమి వద్దకు వెళ్లే సరికి బావివద్ద మోటార్ బిల్డింగ్ పై రమేశ్ మృతిచెంది ఉండటాన్ని గమనించారు. వారు వెంటనే యజమాని సుధాకర్ రెడ్డికి సమాచారం అందించగా, అతను రమేశ్ కుమారుడు లోకేష్‌కు విషయాన్ని తెలిపాడు. వెంటనే అక్కడికి వెళ్లి చూసేసరికి తమ తండ్రి మృతిచెంది ఉన్నాడని, పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్టేషన్ ఘన్‌పూర్, రఘునాథపల్లి సీఐలు జి.వేణు, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఘన్‌పూర్ ఎస్సై వినయ్‌కుమార్ తదితరుల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు.

హత్య చేశారంటూ కుటుంబ సభ్యుల ఆందోళన

భూక్య రమేశ్‌ను చేపలు పట్టేందుకు అని పిలిచి రాత్రి ఉద్దేశపూర్వకంగానే హత్య చేశారని మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఈ విషయమై పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. మృతదేహాన్ని పోస్టుమార్టం పంపించేది లేదంటూ రోదించారు. రమేశ్‌ది ముమ్మాటికీ హత్యేనని, హంతకులను కఠినంగా శిక్షించాలని, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా మృతుడికి భార్య, ముగ్గురు కుమారులున్నారు. మృతుడి కుమారుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేధింపులు తాళలేక బావిలో దూకిన వివాహిత



కటికె సంధ్య (ఫైల్)

ఆత్మకూరు(ఎం)/రఘునాథపల్లి : భర్త, అత్తమామల వేధింపులు తాళలేక వివాహిత వ్యవసాయ బావిలో దూకింది. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు(ఎం) మండలం మొరిపిరాల గ్రామానికి చెందిన కటికె రాములు, మారెమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు కటికె కృష్ణకు జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లి గ్రామానికి చెందిన కేమిడీ బైరయ్య, జయలక్ష్మి దంపతుల రెండో కుమార్తె సంధ్యతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. వివాహానికి ముందు కృష్ణ హైదరాబాద్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పనిచేసేవాడు. వివాహం తర్వాత గ్రామంలోనే వ్యవసాయం చేసుకుంటూ ఉన్నాడు. ఆరు నెలల నుంచి భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆత్మకూరు(ఎం) పోలీస్ స్టేషన్‌లో సంధ్యపై కృష్ణ, జనగామ జిల్లా రఘునాథపల్లి పోలీస్ స్టేషన్‌లో కృష్ణపై సంధ్య పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన సంధ్య ఆదివారం సాయంత్రం ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో సిద్ధాపురం రోడ్డు పక్కన వ్యవసాయ బావిలో దూకింది. సమీపంలో మామిడి చెట్టుకు కాపలాగా ఉన్న కుర్రాడు చూసి చుట్టుపక్కల వారికి సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కృష్ణయ్య ఘటనా స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. బావి గట్టుపై ఆధార్‌కార్డు, చెప్పుల జత, సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫైరింజన్ సహాయంతో వ్యవసాయ బావి నుంచి నీటిని తోడుతున్నారు. బావిలో నీరు చాలా ఉండటంతో సంధ్య ఆచూకీ లభించలేదు. తనను భర్త కృష్ణతో పాటు అత్త, మామ, బావ, తోటికోడలు వేధిస్తున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యకు పరిష్కారం దొరక్కపోవడంతో తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సంధ్య సూసైడ్ నోట్‌లో రాసినట్లు తెలిసింది.

అత్త, మామపై అల్లుడు దాడి

● అత్త మృతి, మామకు తీవ్ర గాయాలు

గుండాల : మద్యం మత్తులో అత్త, మామపై అల్లుడు దాడి చేయడంతో అత్త మృతి చెందగా మామకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం మాణిక్యపురం గ్రామానికి చెందిన గుగులోతు జున్నూబాయి(50), రాజయ్య దంపతుల కుమార్తె చుక్కవ్వను అదే గ్రామానికి చెందిన కనకయ్యకు ఇచ్చి వివాహం చేశారు. గుగులోతు జున్నూబాయి, రాజయ్య దంపతులు సుద్దాల గ్రామానికి చెందిన గూడ పృథ్వీ మామిడి తోటను కౌలుకు తీసుకొని జీవనం సాగిస్తున్నారు. వ్యసనాలకు బానిసైన కనకయ్య ఇటీవల మరో మహిళను పెళ్లి చేసుకొని గుండాల మండలం బూర్జుబావి గ్రామంలో ఇద్దరు భార్యలతో కలిసి మామిడి తోటను కౌలుకు తీసుకొని ఉంటున్నాడు. శనివారం రాత్రి మద్యం మత్తులో ఉన్న కనకయ్య అత్తమామలు ఉంటున్న మామిడి తోట వద్దకు వచ్చి వారితో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఇనుప వస్తువుతో అత్త, మామపై దాడి చేయడంతో జున్నూబాయి అక్కడికక్కడే మృతి చెందింది. రాజయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గుండాలలో ఉంటున్న కాలె కృష్ణ ఆదివారం ఉదయం సుద్దాల గ్రామానికి వెళ్లి చూడగా రాజయ్య రక్తపు మడుగులో పడి ఉండటం చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మృతురాలి పెద్ద కుమార్తె పెంటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రాజయ్యను చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి, జున్నూబాయి మృతదేహాన్ని ఆలేరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు చెప్పారు. ఘటనా స్థలాన్ని భువనగిరి డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, సీఐ శంకర్, ఎస్సై జి. సైదులు పరిశీలించారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట : మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన ఎలికట్ల లక్ష్మి–పెంటయ్య దంపతుల కూతురు చంద్రకళ వివాహానికి అదే గ్రామానికి చెందిన సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్ గౌడ్ ఆర్థిక సాయం ఆదివారం రూ.5వేలను అందజేశారు. స్వామి, సోమయ్య, రఘుపతి, నర్సయ్య, మాతయ్య, బాపు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

జనగామ : జనగామ పట్టణంలోని సంజయ్ నగర్ చమన్ జంక్షన్ వద్ద సంజీవని ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతమ్‌రెడ్డి 150మంది రోగులను పరీక్షించి, రూ.30వేల విలువైన మందులను పంపిణీ చేశారు.

ఉచిత నేత్ర, దంత వైద్యశిబిరం

స్టేషన్‌ఘన్‌పూర్ : స్టేషన్‌ఘన్‌పూర్‌లోని మోడల్ కాలనీ ఫ్యూచర్‌మైండ్ స్కూల్‌లో ఆదివారం నేత్ర, దంత వైద్యశిబిరం నిర్వహించారు. శ్రీగణేష్ డెంటల్ క్లినిక్, శరత్ కంటి వైద్యుల ఆధ్వర్యంలో రోగులకు పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో మొత్తం వంద మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఫ్యూచర్‌మైండ్ స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ సందెల నవీన్, రమేశ్ తెలిపారు.

వారాహి ఆస్పత్రి ఆధ్వర్యంలో..

రఘునాథపల్లి : మండలంలోని గబ్బెట ప్రాథమిక పాఠశాల ఆవరణలో జనగామ వారాహి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని మాజీ సర్పంచ్ జిట్టబోయిన రాజు ప్రారంభించారు. ఈ శిబిరంలో ఆస్పత్రి వైద్యులు రంగు కార్తీక్‌గౌడ్, దూలం ప్రదీప్‌గౌడ్, మడిపల్లి ఉదయ్‌కుమార్‌గౌడ్, నడికట్టు శిరీషలు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. మాజీ సర్పంచ్ రాజు, గూడెల్లి సురేష్, హెచ్‌ఎం, గ్రామస్తులు ఉచిత వైద్యశిబిరం నిర్వహించిన వైద్యులను శాలువాతో సత్కరించారు.

సంక్షిప్త సమాచారం

పండ్ల మొక్కల పంపిణీ

లింగాలఘణపురం : మండలంలోని రైతులకు సంకల్ప తరువు ఫౌండేషన్ ఆధ్వర్యంతో ఉచితంగా పండ్ల మొక్కల పంపిణీ చేయడం జరుగుతుందని ఫౌండేషన్ రాష్ట్ర మేనేజర్ రమేశ్ ఆదివారం తెలిపారు. రైతులు 9440638684 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేరాల నియంత్రణకు కృషి చేయాలి

కొడకండ్ల : శాంతిభద్రతల రక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యంగా పోలీసులు పనిచేయాలని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సై చింత రాజు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాలి

జఫర్‌గఢ్ : బాల్‌బ్యాడ్మింటన్‌లో క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గాదెపాక అయోధ్య కోరారు. మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాల్ బ్యాడ్మింటన్ వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కోశాధికారి కాటం రాజిరెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా అయోధ్య పాల్గొని మాట్లాడారు. జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు పూజశ్రీ, సుతారి రిషితను అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు.

పరామర్శ

జనగామ రూరల్ : జిల్లా కేంద్రంలోని ప్రముఖ వ్యాపారవేత్త రమేశ్‌చంద్ర తండ్రి లక్ష్మీనారాయణ ఇటీవల మరణించగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. లక్ష్మీనారాయణ చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. శ్రీనివాస్ పాల్గొన్నారు.